సాక్షి
నిర్మల్
శనివారం ၊ 16 ၊ మార్చి ၊ 2024



హైవేలపై అంతా దుమ్మే..!

జాతీయ రహదారులపై దుమ్ము వాహనదారులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ద్విచక్ర వాహనదారులు శ్వాస సంబంధ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

9లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
శని : 6:27	ఆది : 5:01

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.3 /25.5

ఆకాశం కొంతమేర మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. మధ్యాహ్నం వేడి, ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మార్క్సిజం అజేయమైనది



కార్ల్ మార్క్స్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: జర్మన్ శాస్త్రవేత్త, సోషలిస్టు విప్లవకారుడు కార్ల్ మార్క్స్ రచించిన మార్క్సిజం అజేయమైనదని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు కె.రాజన్న అన్నారు. కార్ల్ మార్క్స్ 141వ వర్ధంతి సందర్భంగా నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రజాపంథా కార్యాలయంలో శుక్రవారం వర్ధంతి సభ నిర్వహించారు. మార్క్స్ చిత్రపటానికి నివాళులర్పించారు. సమాజం, ఆర్థిక శాస్త్రం, రాజకీయాలు వంటివాటిపై మార్క్స్ సిద్ధాంతాలను కలగలిపి మార్క్సిజంగా పిలుస్తున్నారన్నారు. వర్గ పోరాటాల ద్వారా కార్ల్ మార్క్స్ మానవ చరిత్రలోకెల్లా అత్యంత ప్రభావశీలమైన వ్యక్తుల్లో ఒకరిగా పేరొందారని, ఆయన కృషి, సిద్ధాంతం అటు ప్రశంసలు, ఇటు విమర్శలు కూడా విస్తృతంగా పొందిందన్నారు. ఆర్థిక శాస్త్రంలో ఆయన కృషి శ్రమ ఎనలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు ఆర్.రామలక్ష్మణ్, కిషన్, సాయన్న లక్ష్మణ్‌వర్మ పాల్గొన్నారు.

ఉత్తమ సూపర్‌వైజర్‌గా శ్రీలత



అవార్డు అందుకుంటున్న సూపర్‌వైజర్ శ్రీలత

ఖానాపూర్: నిర్మల్ జిల్లా ఐసీడీఎస్ పరిధిలోని ఖానాపూర్ ప్రాజెక్టులో విధులు నిర్వహించే సూపర్‌వైజర్ శ్రీలత ఉత్తమ సూపర్‌వైజర్‌గా అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో గురువారం రాత్రి జరిగిన స్టేట్ లెవెల్ మహిళా దినోత్సవంలో ఉత్తమ సూపర్‌వైజర్‌గా అవార్డు ప్రదానం చేశారు. మహిళ శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ క్రాంతి అవార్డు అందజేశారు.

పన్ను బకాయిదారుల ఆస్తులు సీజ్



ఆస్తులు సీజ్ చేస్తున్న మున్సిపల్ కమిషనర్

భైంసాటౌన్: పట్టణంలో పన్ను బకాయి ఉన్న పలువురి ఆస్తులను మున్సిపల్ అధికారులు శుక్రవారం సీజ్ చేశారు. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆదేశాల మేరకు ఈ మేరకు చర్యలు తీసుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. పట్టణంలోని మోనా జిన్నింగ్ ఫ్యాక్టరీ/మీనా ఇండస్ట్రీస్(రూ.10.21 లక్షలు), శ్రీలక్ష్మి ఎంటర్‌ప్రైజెస్(రూ.17.76 లక్షలు), ముత్యంరెడ్డి (రూ.37,059), మహేశ్ జిన్నింగ్ ఫ్యాక్టరీ(రూ.10.12 లక్షలు) ఆస్తి పన్ను బకాయిలు ఉన్నాయి. పలుమార్లు నోటీసులు జారీ చేసినా స్పందించకపోవడంతో ఆస్తులు సీజ్ చేసినట్లు కమిషనర్ వెల్లడించారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

అటవీ శాఖ ఉద్యోగులకు సన్మానం




అటవీ ఉద్యోగులను సన్మానిస్తున్న టీఎన్జీవో నాయకుల

నిర్మల్‌టౌన్: ప్రభుత్వం అటవీ శాఖలోని సూపరింటెండెంట్లు, మేనేజర్లకు గెజిటెడ్ హోదా కల్పిస్తూ.. అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో గెజిట్ హోదా పొందిన ఉద్యోగులు సుదర్శన్, మోహన్, శ్రీనివాస్, అరుణ్‌కుమార్‌ను అటవీశాఖ కార్యాలయంలో టీఎన్జీవోస్ యూనియన్ ఆధ్వర్యంలో సన్మానించారు. టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, నాయకులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలోని ద్యాగవాడకు చెందిన రాజేశ్ కుమారుడు ప్రస్తుతం పదో తరగతి పరీక్షలను రాయబోతున్నాడు. అయితే హైదరాబాద్‌కు చెందిన ఓ కార్పొరేట్ కాలేజీ నియమించుకున్న పీఆర్వో కొన్ని రోజులుగా ఆ విద్యార్థి ఇంటి చుట్టూ తిరుగుతున్నాడు. తల్లిదండ్రులను కలుస్తూ తమ కాలేజీలో చేర్పించాలని కోరుతున్నాడు. రంగు రంగుల బ్రోచర్లు.. హైటెక్ హంగులు చూపుతూ ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నాడు.

సారంగాపూర్ మండల కేంద్రానికి చెందిన ఓ విద్యార్థిని గతేడాది టెన్త్ పూర్తి చేసింది. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లికి చెందిన ఓ ప్రముఖ కార్పొరేట్ కాలేజీలో అడ్మిషన్ పొందింది. అన్నిరకాల ఫీజులు కలిపి ఏడాదికి రూ.1.40 లక్షలు చెల్లించేందుకు అంగీకారం కుదిరింది. కానీ, ఇప్పటికే రూ.2 లక్షలు చెల్లించాడు. ఇదేంటని అడిగితే ఏసీ, నాన్ ఏసీ, హాట్ వాటర్, బుక్స్, మెటీరియల్, ధోబీ అని చెబుతున్నారు. అడ్మిషన్ చేసుకునే వరకు ఒకమాట.. అడ్మిషన్ తర్వాత ఒకమాట చెప్పడంపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

కార్పొరేట్ గాలం



విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటం..

విద్యార్థుల ఇష్టాయిష్టాలు తెలుసుకోకుండా తల్లిదండ్రులు తమ పిల్లల్ని కార్పొరేట్ కాలేజీల్లో జాయిన్ చేయడం వల్ల తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంటుందని విద్యారంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. తల్లిదండ్రులు తొందరపడి తమ పిల్లల భవిష్యత్తును నాశనం చేయొద్దని సూచిస్తున్నారు. ఒకసారి కాలేజీల్లో చేరిన తర్వాత పట్టించుకునే నాథుడే ఉండడని చెబుతున్నారు. విద్యాబోధన సరిగా లేకున్నా ఫీజుల వసూళ్లు మాత్రం తగ్గేదే లేదంటూ ముక్కుపిండి మరీ వసూలు చేస్తాయని గుర్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు ఆరా తీసిన తర్వాత, పిల్లల అభిప్రాయం తెలుసుకున్నాక అడ్మిషన్ తీసుకోవాలని సూచిస్తున్నారు.

మాయలో పడొద్దు..



కార్పొరేట్ కాలేజీలు అరచేతిలో వైకుంఠం చూపి విద్యార్థులను జాయిన్ చేసుకుంటున్నాయి. పదో తరగతి పూర్తికాకముందే ఇంటర్ అడ్మిషన్లు పోటీపడి చేయడం కార్పొరేట్ కాలేజీల వ్యాపార ధోరణికి నిదర్శనం. తల్లిదండ్రులు వారి మాయలో పడి మోసపోవద్దు. అధ్యాపకుల అనుభవం విద్యార్హతలు వంటివి నిర్ధారణ చేసుకున్న తర్వాతనే జాయిన్ చేయాలి. కాలేజీ వివరాలు, వసతి సౌకర్యాలు వంటివి చూసుకున్న తర్వాతే అడ్మిషన్ తీసుకోవాలి. అడ్మిషన్ల దందాపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం.

– ఖైరి శశిధర్,
ఏబీవీపీ జిల్లా కన్వీనర్, నిర్మల్

ప్రభుత్వ కాలేజీల్లో అన్ని సౌకర్యాలు..



ప్రస్తుతం ప్రభుత్వ ఇంటర్ కళాశాలలో గతంలో కంటే సౌకర్యాలు మెరుగయ్యాయి. అధ్యాపకులు కూడా అందుబాటులో ఉన్నారు. అన్ని రకాల వసతులు ఉన్నాయి. పేద దిగువ మధ్యతరగతికి చెందిన విద్యార్థులు కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలల అసత్య ప్రచారాన్ని నమ్మి డబ్బులు వృథా చేసుకోవద్దు. ప్రభుత్వ కళాశాలలో నిపుణులైన అధ్యాపకులతో ఉచిత విద్యాబోధన కొనసాగుతుంది. ఆర్థికంగా నష్టపోకుండా తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రభుత్వ కాలేజీల్లో చేర్పించాలి. కార్పొరేట్ కళాశాలల ఏజెంట్లు ఫోన్లు చేసి ఇబ్బంది పెడితే ఫిర్యాదు చేయాలి.

– జాదవ్ పరశురాం,
జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి, నిర్మల్

- టెన్త్ విద్యార్థులకు 'కార్పొరేట్' వల
- పీఆర్వోలను నియమించుకుని అడ్మిషన్లు
- ఫోన్ నంబర్లు సేకరించి.. ఇంటింటికీ వెళ్తున్న ఏజెంట్లు
- ఇంటర్ ప్రవేశాల కోసం కాలేజీల మాయాజాలం..

కాలేజీలను చూడకుండానే..

విద్యార్థుల తల్లిదండ్రులను మభ్యపెడుతూ ఒకరిని అడ్మిషన్ చేసి వారి పేరు చెబుతూ సంబంధిత మిత్రులు, బంధువుల పిల్లలను కూడా కూడా జాయిన్ చేసేస్తున్నారు. అసలు కాలేజీని సందర్శించకుండానే, వివరాలు తెలుసుకోకుండానే అడ్మిషన్ల తంతు పూర్తి చేస్తున్నారు. ముందుగానే సీట్ రిజర్వ్ చేసుకోకపోతే కోరిన బ్రాంచుల్లో సీటు దొరకదని బెదరగొడుతున్నారు. బోధన వివరాలు, కోర్సు ఫీజు, గతేడాది ఫలితాల వివరాల వంటివి తెలుసుకోకుండానే తల్లిదండ్రులు కూడా కార్పొరేట్ కాలేజ్ కళాశాలల వలలో చిక్కుతున్నారు.

నిర్మల్‌ఖిల్లా: మరో ఐదు రోజుల్లో పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కాబోతున్నాయి. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు కలుపుకుని సమారు 9 వేల మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయబోతున్నారు. వీరిపై కార్పొరేట్ కాలేజీల కన్ను పడింది. తమ కళాశాలల్లో చేర్పించుకునేందుకు పీఆర్వోలు, ఏజెంట్ల ద్వారా ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నాయి. పరీక్షల కోసం విద్యార్థులు సన్నద్ధం అవుతుండగా, ఏజెంట్లు విద్యార్థుల తల్లిదండ్రుల ఫోన్ నంబర్లు సేకరించి తమ కాలేజీల్లో పిల్లలను చేర్పించాలని పేరెంట్స్‌కు ఫోన్ చేస్తున్నారు. తమ కాలేజీల గురించి ఊదరగొడుతున్నారు. ప్రత్యేక బిల్డింగ్‌లు, ప్రత్యేక సదుపాయాలు అంటూ ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. కొందరు ఏజెంట్లు విద్యార్థుల ఇంటికి వెళ్లిన రంగురంగు బ్రోచర్లు చూపించి అడ్మిషన్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. అడ్మిషన్ తీసుకుంటే ఫీజు రాయితీ ఇస్తామని మభ్యపెడుతున్నారు. ఐఐటీ, నీట్, హాస్టల్ వసతి, విశాలమైన ప్రయోగశాలలు అంటూ మాయ చేస్తున్నారు.

వ్యాపారంగా మారిన విద్య..

విద్య వ్యాపారంగా మార్చిన కర్పొరేట్ కాలేజీలు ఏజెంట్లను నియమించి మరీ అడ్మిషన్లు చేస్తున్నారు. ఏజెంట్లు కమీషన్ల కోసం కాలేజీ గురించి మాయ మాటలు చెబుతూ విద్యార్థులను జాయిన్ చేసుకుంటున్నారు. విద్యాబోధన తీరు, బోధకులు వారి అనుభవం, కళాశాల గుర్తింపు, సీనియర్ విద్యార్థుల ద్వారా కాలేజీ వివరాలను తెలుసుకోవడం వంటివి కచ్చితంగా చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. వ్యాపారధోరణితో నిర్వహించే కాలేజీల్లో సరైన వసతి, సౌకర్యాలు కూడా లేకుండా, సరైన భోజనం అందించకుండా ఉంటున్నాయని సీనియర్ విద్యార్థులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అన్నీ చూసుకున్న తర్వాతే విద్యార్థులను జాయిన్ చేయాలని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా విద్యార్థుల తల్లిదండ్రులు కార్పొరేట్ కాలేజీల మాయలో పడకుండా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని సూచిస్తున్నారు.

అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థిని ఎంపిక చేస్తున్న అదనపు కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: ప్రభుత్వం పేద విద్యార్థులకు అందించే ప్రతీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఒకటో తరగతి ఉచిత సీటుకు విద్యార్థిని లక్కీడ్రా ద్వారా ఎంపిక చేశారు. ఈ సీటు కోసం వచ్చిన 14 దరఖాస్తుల్లో తొమ్మిది మంది హాజరయ్యారు. కాగా డ్రాలో తురాటి గ్రామానికి చెందిన గడ్డం తన్వి సీటు సాధించింది. మరో ఇద్దరు విద్యార్థులను ఎంపిక చేసి వెయిటింగ్ లిస్టులో ఉంచారు. సీటు సాధించిన విద్యార్థినికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఒక విద్యా సంవత్సరంలో విద్యార్థిపై ప్రభుత్వం లక్ష రూపాయల వరకు వెచ్చిస్తుందన్నారు. సమావేశంలో ఎస్సీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి రాజేశ్వర్‌గౌడ్, సూపరింటెండెంట్ శ్రీదేవి, నిర్మల్ ఏఎస్ డబ్ల్యూవో లత, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, మెప్మా పీడీ సుభాష్ విద్యార్థుల తల్లిదండ్రులు, అధికారులు పాల్గొన్నారు.

రశీదులు పొందడం వినియోగదారుని హక్కు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్

నిర్మల్‌చైన్‌గేట్: కొనుగోలు చేసిన వస్తువులకు సంబంధించిన రశీదు పొందడం ప్రతీ వినియోగదారుని హక్కు అని అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో అంతర్జాతీయ వినియోగదారుల దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాట్లాడారు. ప్రజలకు వినియోగదారుల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. వినియోగదారుడు ప్రశ్నించడం మొదలు పెట్టినప్పుడే నాణ్యమైన వస్తు సేవలను పొందగలడన్నారు. వస్తువుల్లో నాణ్యతా లోపాలపై వినియోగదారుడు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. వినియోగదారుల హక్కులను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని చెప్పారు. ప్రతీ అధికారి బాధ్యతగా వినియోగదారుని హక్కులను వారికి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రత్నకళ్యాణి, సివిల్ సప్లై డీఎం శ్రీకళ, డీఎస్‌వో నందిని, మెప్మా పీడీ సుభాష్, ఎల్డీఎం చంద్రశేఖర్, రేషన్ డీలర్లు, వంట గ్యాస్ ఏజెన్సీల డీలర్లు, పెట్రోల్ బంకుల యజమానులు, అధికారులు పాల్గొన్నారు.

సిరాల ప్రాజెక్టు పునరుద్ధరణకు గ్రీన్‌సిగ్నల్

- పిప్రి, కన్నాపూర్ ఎత్తిపోతలకూ నిధులు మంజూరు
- ఎమ్మెల్యే పవార్ రామారావుపటేల్ వెల్లడి



రామారావుపటేల్

భైంసాటౌన్: వానాకాలంలో భారీ వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్న మండలంలోని సిరాల ప్రాజెక్టు పునరుద్ధరణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే పవార్ రామారావుపటేల్ శుక్రవారం తెలిపారు. ఈ మేరకు ప్రాజెక్టు నిర్మాణానికి రూ.12.37 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. భారీ వర్షాలకు సిరాలతోపాటు సిరాల శివారులోని కొత్త చెరువు కట్ట తెగి రైతులు పంటలు నష్టపోయిన విషయం తెలిసిందే. ప్రాజెక్టు పూర్తిగా నీరు లేక ఖాళీగా మారింది. దీంతో ప్రాజెక్టు కింద ఆయకట్టు సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఈ విషయమై ఎమ్మెల్యే అసెంబ్లీ సమావేశాల్లో సైతం ప్రస్తావించారు. దీంతో సిరాలతోపాటు శివారులోని కొత్త చెరువు పునరుద్ధరణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అలాగే లోకేశ్వరం మండలం కన్నాపూర్, పిప్రి ఎత్తిపోతల పథకాలకు రూ.18 కోట్లు, రూ.1.41 కోట్ల చొప్పున నిధులు కేటాయించినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. నియోజకవర్గంలో సాగునీటి పథకాలకు నిధులు కేటాయించడంపై సీఎం రేవంత్‌రెడ్డితోపాటు నీటిపారుదల శాఖ మంత్రికి ఎమ్మెల్యే రామారావుపటేల్ కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్టీసీ బస్సును అడ్డుకున్న మలక్‌చించోలి మహిళలు



ఆర్టీసీ బస్సు ఎదుట నిరసన తెలుపుతున్న మహిళలు

నిర్మల్: సారంగాపూర్ మండలం మలక్‌చించోలి గ్రామానికి చెందిన మహిళలు శుక్రవారం ఆర్టీసీ బస్సును అడ్డుకుని రోడ్డుపై ఆందోళనకు దిగారు. సుమారు గంటన్నరపాటు ఆర్టీసీ బస్సును అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా గ్రామ మహిళలు మాట్లాడుతూ తమ గ్రామానికి గతంలో ప్రతీరోజు ఆర్టీసీ బస్సు వచ్చేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం అమలు చేసిన నుంచి ఆర్టీసీ బస్సు అప్పుడపుడు మాత్రమే వస్తుందన్నారు. దీంతో తాము పథకానికి దూరం కావడమే కాకుండా పిల్లలు పాఠశాలకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఇదివరకు దాదాపు 7 ట్రిప్పులు ఆర్టీసీ బస్సు నడిపేవారని, ఇప్పుడు మాత్రం కనీసం ఒక్క ట్రిప్పు కూడా సక్రమంగా రావడం లేదన్నారు. రాత్రిపూట ఒంటరిగా ప్రయాణించే మహిళలు అనేక ఇబ్బందులు పడే పరిస్థితి ఉందని ప్రైవేటు వాహనాలే దిక్కవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్టీసీ డీఎం స్పష్టమైన హామీ ఇచ్చే వరకు ఆందోళన విరమించేది లేదని పట్టుబట్టారు. కండక్టర్ ఆర్టీసీ డీఎంను ఫోన్‌లో సంప్రదించారు. తాను హైదరాబాద్‌లో జరుగుతున్న మీటింగ్‌కు హాజరయ్యానని వచ్చాక సమస్యపై చర్చిద్దామని తెలిపినా వినిపించుకోకపోవడంతో ఆర్టీసీ అసిస్టెంట్ డీఎంతో గ్రామస్తులు ఫోన్‌లో మాట్లాడారు. డీఎం వచ్చాక గ్రామానికి చెందిన పదిమంది వచ్చి డీఎంతో మాట్లాడితే సమస్యకు పరిష్కారం దొరుకుతుందని తెలుపడంతో మహిళలు ఆందోళన విరమించారు.

ప్రబలుతున్న గాలికుంటు..!

- గ్రామాల్లో నాటు వైద్యమే దిక్కు..!
- పట్టించుకోని పశు వైద్యాధికారులు
- ఆందోళన చెందుతున్న పశు పోషకులు

జిల్లాలో పశువుల వివరాలిలా...	
ఆవులు, ఎద్దులు	1,79,045
గేదెలు	1,21,193
గొర్రెలు	5,02,576
మేకలు	1,31,866



వ్యాధి సోకిన పశువుల మెడలో ఆకు తీగలు

భైంసాటౌన్/కుంటాల: జిల్లాలో మూగ జీవాలు గాలికుంటు వ్యాధిబారిన పడుతున్నాయి. కుంటాల మండలం అందకూర్ గ్రామంలో పదుల సంఖ్యలో ఆవులు, దూడలు వ్యాధి బారిన పడగా, స్థానిక పశు వైద్యాధికారులు పట్టించుకోవడం లేదని పశు పోషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో నాటు వైద్యం చేయిస్తూ పశువులను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నామని చెబుతున్నారు. వ్యాధి బారిన పడిన పశువుల మెడకు ఆకు తీగలు, కొమ్ములకు సున్నం పూయడం చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని పశువులు వ్యాధి బారిన పడి నోటి నుంచి సొంగ, నురగ కారడం, కుంటుతుండడం చేస్తున్నాయని చెబుతున్నారు. రెండు దూడలు మృతి చెందాయని తెలిపారు. వ్యాధి బారిన పడకుండా ముందస్తుగా గుర్తించి నివారించాల్సిన సంబంధిత అధికారులు గ్రామాల్లో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి టీకాలు వేస్తామని కాలయాపన చేస్తున్నారని పశు పోషకులు పేర్కొంటున్నారు.

వ్యాధి తీవ్రత ఎక్కువే...

పశువుల్లో ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలతోపాటు ఇతర పశువులకు సంక్రమిస్తున్న ప్రధాన వ్యాధుల్లో గాలికుంటు వ్యాధి ఒకటి. దీని బారిన పడిన పశువులు 24 గంటల్లో చిక్కిపోయి అల్సర్‌కు గురవుతాయి. రెండు నుంచి ఆరు రోజుల వరకు జ్వర తీవ్రత ఎక్కువగా ఉంటుంది. నోరు, పెదాలు, నాలుక, పొదుగు, కాళ్ల గిట్టల మధ్య పుండ్లు వచ్చి కుంటుతూ నడుస్తాయి. మేత, నీరు సరిగా తీసుకోలేవు. నెమరు వేయలేవు. నోటి నుంచి సొంగ లేక నురగ కారుతుండటంతోపాటు బరువు తగ్గిపోతాయి. పాలిచ్చే పశువుల్లో ఉత్పత్తి తగ్గుతుంది. అలాగే వ్యాధి నిరోధక శక్తి తగ్గి కొన్నిసార్లు పశువులు చనిపోయే అవకాశం ఉంది. వ్యాధి సోకిన పశువుల పాలు తాగిన దూడలు సైతం వ్యాధికి గురై చనిపోతాయి. గాలికుంటు అంటు వ్యాధి కావడంతో అవగాహన లేక మందలుగా ఒకే దగ్గర ఉంటే వ్యాధి త్వరగా ప్రబలే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పశుపోషకులకు తగిన సలహాలు, సూచనలు చేయడంతోపాటు సకాలంలో చికిత్స అందిస్తే ప్రయోజనకరంగా ఉంటుందని పశుపోషకులు కోరుతున్నారు.

పట్టించుకోవడం లేదు..

గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి సోకింది. ఈ విషయం పశు వైద్యులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. దీంతో చేసేది లేక పశువులను కాపాడుకునేందుకు నాటు వైద్యం చేస్తున్నాం. ఇప్పటికే రెండు దూడలు కూడా చనిపోయాయి. అధికారులు పట్టించుకోవాలి.

– దయాకర్, పశుపోషకుడు, అందకూర్

జిల్లాలో ఇలా...

పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణ కోసం ప్రభుత్వం ఏటా రెండుసార్లు ఉచిత టీకా పంపిణీ కార్యక్రమం చేపడుతుంది. సెప్టెంబర్, ఫిబ్రవరి నెలల్లో నెలరోజులపాటు టీకా కార్యక్రమం చేపడతారు. ప్రస్తుతం నేషనల్ లైవ్‌స్టాక్ హెల్త్ ప్రోగ్రాం కింద ఈనెల 15 నుంచి ఏప్రిల్ 14 వరకు పశువులకు ఉచిత టీకా కార్యక్రమం ప్రారంభించారు. జిల్లాలో ఆవులు, ఎద్దులు, గేదెలు కలిపి దాదాపు 3 లక్షల వరకు ఉంటాయి. అలాగే గొర్రెలు, మేకలు 6.34 లక్షల వరకు ఉంటాయి. జిల్లావ్యాప్తంగా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత టీకా కార్యక్రమం శుక్రవారం నుంచి ప్రారంభించారు. అయితే, ఇప్పటికే కొన్నిచోట్ల పశువులు వ్యాధి బారిన పడ్డాయి. స్థానిక పశు వైద్యాధికారుల నిర్లక్ష్యం కారణంగా పశువులు మృత్యువాత పడుతున్నాయని పశుపోషకులు ఆరోపిస్తున్నారు. పశువులు వ్యాధి బారిన పడిన విషయం సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా తెలిపినా నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారని పేర్కొంటున్నారు. ఈ విషయమై జిల్లా పశు సంవర్ధక శాఖ ఇన్‌చార్జి అధికారి గంగాధరయ్యను ఫోన్‌లో సంప్రదించగా సమాధానమివ్వలేదు.

'ఉమ్మడి ఆదిలాబాద్'ను అగ్రగామిగా నిలపాలి

- ఇన్‌చార్జి మంత్రి సీతక్క
- నాలుగు జిల్లాల ఉన్నతాధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న ఇన్‌చార్జి మంత్రి సీతక్క, వేదికపై కలెక్టర్లు, ఎస్పీలు, ఎమ్మెల్యే బొజ్జు తదితరులు

ఉట్నూర్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను అభివృద్ధిలో అగ్రగామిగా తీర్చిదిద్దాలని రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, ఉమ్మడి ఆదిలాబాద్ ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కేబీ ప్రాంగణంలో గల పీఎంఆర్సీ సమావేశ మందిరంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యువత పెడదారి పట్టకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. స్వయం ఉపాధి, తదితర రంగాల్లో రాణించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. అలాగే వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్, డీఆర్డీఏ, విద్యుత్, ఆర్‌అండ్‌బీ, డీడబ్ల్యూవో శాఖల అభివృద్ధి పనులపై ఆరా తీశారు. పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే జిల్లా పచ్చదనంతో కళకళలాడాలన్నారు. నాలుగు జిల్లాల ఉన్నతాధికారులు సమష్టిగా పనిచేస్తూ ఉమ్మడి జిల్లా అభివృద్ధికి కృషి చేయాలన్నారు. తన సహాయ, సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. సమావేశంలో ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా, నిర్మల్ కలెక్టర్ ఆశిశ్ సాంగ్వాన్, మంచిర్యాల కలెక్టర్ సంతోష్, ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధొత్రే, నాలుగు జిల్లాల ఎస్పీలు, అదనపు కలెక్టర్లు, అటవీశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ట్రైబల్ ఎఫ్‌పీవోకు డ్రోన్, ఎలక్ట్రికల్ ఆటో



డ్రోన్ వినియోగాన్ని వివరిస్తున్న ఇఫ్కో మేనేజర్

పెంబి: మండల కేంద్రంలోని ట్రైబల్ ఎఫ్‌పీవోకు రూ.15 లక్షలు విలువైన పురుగు మందులు పిచికారీ చేసే డ్రోన్, ఎలక్ట్రికల్ ఆటోను ఇఫ్కో కంపెనీ మంజూరు చేసింది. వాటిని సంస్థ తెలంగాణ రాష్ట్ర మేనేజర్ కృపా శంకర్ పెంబి రైతువేదికలో శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 600 మంది రైతులు సంఘటితమై సంఘాలుగా ఏర్పడితే ఇలాంటి ప్రోత్సాహకరాలు పొందవచ్చని తెలిపారు. జిల్లాలో నలుగురు యువకులకు ఒకొక్కరికి రూ.15 లక్షలు విలువ చేసే అగికల్చర్ స్ప్రే డ్రోన్, ఎలక్ట్రికల్ వాహనాలను అందించామని వివరించారు. సహకార సంఘాల నుంచి ఇఫ్కో కంపెనీ ఎరువుల బస్తాలు కొనుగోలు చేసే రైతులకు కనిష్టంగా రూ.4 వేల నుంచి గరిష్టంగా రూ.లక్ష వరకు ఉచిత ప్రమాద బీమా ఇఫ్కో కంపెనీ అందిస్తుందని తెలిపారు. అనంతరం సమీపంలోని మొక్కజొన్న పంటపై డ్రోన్ సహాయంతో రసాయన మందు పిచికారీ చేయించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవోలు రాజ్‌కుమార్, గంగాజల, ట్రైబల్ ఎఫ్‌పీవో సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆలయంలో చోరీ



హుండీని పరిశీలిస్తున్న క్లూస్ టీం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్ కాలనీలోని మహాలక్ష్మి ఆలయంలో గురువారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. ఆలయం హుండీని కొద్ది దూరం ఎత్తుకెళ్లి తాళం పగలగొట్టి అందులోని నగదును అపహరించుకుపోయారు. శుక్రవారం ఉదయం ఆలయానికి వచ్చిన భక్తులు గమనించి హుండీ కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. క్లూస్ టీం సిబ్బంది అక్కడికి చేరుకొని ఫింగర్ ప్రింట్స్ సేకరించి దర్యాప్తు ప్రారంభించారు.

విచారణ ప్రారంభం

ఆదిలాబాద్: ఆదిలాబాద్ హెడ్ పోస్టాఫీస్‌లో ఇండియన్ పోస్టల్ పేమెంట్స్ బ్యాంక్ మేనేజర్ జాదవ్ విజయ్ కుమార్ రైతుల డబ్బులను తన ఖాతాలోకి మళ్లించుకున్న ఘటన నేపథ్యంలో శుక్రవారం విచారణ అధికారి భాస్కర్ వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా విచారణ విషయాన్ని తెలుసుకున్న రైతులు పెద్ద ఎత్తున కార్యాలయానికి చేరుకున్నారు. తమకు న్యాయం చేయాలని, డబ్బులు రికవరీ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులందరికీ తగిన న్యాయం చేస్తామని విచారణ అధికారి హామీ ఇచ్చారు. డబ్బులను ఖాతాల్లోకి మళ్లించుకున్న సంబంధిత అధికారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. అనంతరం రైతులు పెద్ద ఎత్తున వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ తరలివెళ్లి విచారణ అధికారితో వన్‌టౌన్ సీఐ సత్యనారాయణకు విషయాన్ని వివరించారు. అయితే సీఐ మాట్లాడుతూ రైతుల డబ్బుల మళ్లింపు విషయాన్ని తెలియజేసినప్పటికీ రాతపూర్వకంగా ఫిర్యాదు చేయలేదన్నారు. రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే విచారణ చేపడతామని స్పష్టం చేశారు.

ఇద్దరి అదృశ్యం

ఎదులాపురం: టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇద్దరు అదృశ్యమైనట్లు ఎస్సై జీవీ రమణారెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం .. మహారాష్ట్రకు చెందిన మాండ్వీ తాలుకా ఝరిలో జామిని గ్రామానికి చెందిన 38 ఏళ్ల దూదల్‌కర్ గజానన్ పట్టణంలోని మహాలక్ష్మివాడలో నివాసం ఉంటున్నాడు. కూలీ పనికి వెళ్తున్నానని ఈనెల 14న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో భార్య మమత శుక్రవారం టుటౌన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మహిళ..
పట్టణంలోని ఖుర్షీద్‌నగర్‌కు చెందిన 36 ఏళ్ల వివాహిత ఈ నెల 13న మధ్యాహ్నం ఒంటి గంటకు పుట్టింటికి వెళ్తున్నట్లు చెప్పి వెళ్లిన సదరు మహిళ ఇంటికి తిరిగిరాకపోవడంతో కుటుంబీకులు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఆదిలాబాద్‌రూరల్: ఐదు నెలల కిందట మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారి 44పై హరితవనం పార్క్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఆదిలాబాద్ పట్టణానికి చెందిన విశ్వనాథ్ (46) గురువారం రాత్రి మృతి చెందాడు. కారు ప్రమాదంలో గాయాలు కాగా చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించారు. పరిస్థితి విషమించి గురువారం రాత్రి మృతి చెందాడు. ఈ విషయంపై పోలీసులను సంప్రదించగా ఫిర్యాదు అందలేదని తెలిపాడు.

ఆర్థిక చేయూత అందేనా..?



సీఎం, మంత్రుల ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేస్తున్న నేతలు (ఫైల్)

- 16 కార్పొరేషన్‌లు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం
- హర్షం వ్యక్తం చేస్తున్న ఆయా కులాలు

ఆదిలాబాద్‌రూరల్: గతంలో బీసీ, ఎస్సీ, ఎస్టీల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వాలు ఆయా శాఖల ద్వారా సబ్సిడీపై బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలను అందజేసేది. గత ప్రభుత్వం ఎస్సీల ఆర్థికాభివృద్ధి కోసం దళిత బంధు లాంటి పథకాలను ప్రవేశపెట్టి రుణాలు అందజేసింది. అర్హులైన వారందరికీ రుణాలు అందడం లేదని ఎస్సీ సంఘాల నాయకులు ఆందోళన చేసిన సందర్భాలు ఉన్నాయి. అలాగే 2016 కంటే ముందు బీసీ కార్పొరేషన్ ద్వారా బీసీలకు సబ్సిడీపై రుణాలు అందజేసింది. తర్వాత ఆ కార్పొరేషన్‌ను బీసీ అభివృద్ధి శాఖలో విలీనం చేసిన విషయం తెలిసిందే. గత ప్రభుత్వం బీసీల సంక్షేమానికి, ఆర్థికాభివృద్ధికి ఎలాంటి నిధులు మంజూరు చేయడం లేదని, ప్రత్యేకంగా బీసీల అభివృద్ధికి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని బీసీలలోని పలు కులాలకు చెందిన వారు డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా ఎస్టీల కోసం ఐటీడీఏ ద్వారా రుణాలను అందజేస్తున్నారు. ఆయా ఆర్థిక సంవత్సరంలో చాలా మంది అర్హులైన వారికి రుణాలను అందడం లేదు. ఎస్టీల సంక్షేమానికి ప్రత్యేకంగా కార్పొరేషన ఏర్పాటు చేసి నిధులు మంజూరు చేయాలని గిరిజన సంఘాల నాయకులు గతంలో డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. ఆర్థికంగా వెనుకబడిన కులాలను అభివృద్ధి చేయాలని ఆలోచించిన కాంగ్రెస్ ప్రభుత్వం కార్పొరేషన్‌లు ఏర్పాటు చేస్తూ రాష్ట్ర కేబినెట్ మంగళవారం నిర్ణయం తీసుకుంది. దీంతో ఆయా కార్పొరేషన్‌లకు ప్రత్యేకంగా నిధులు మంజూరు కానున్నాయి. వాటి ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించడానికి ఆస్కారం ఉంటుందని పలు సంఘాల నేతలు పేర్కొంటున్నారు.

నూతనంగా ఏర్పాటు కానున్న కార్పొరేషన్లు..
రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఓబీసీ, ఎస్సీ, ఎస్టీల కోసం 16 కార్పొరేషన్‌లు ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకుంది. అందులో యాదవ, కుర్మ, మున్నూరుకాపు, పద్మశాలి, పెరిక (పురగిరి క్షత్రియ), లింగాయత్, బలిజ, గంగపుత్ర, మేరు, ముదిరాజ్, ఆర్య వైశ్య, రెడ్డి, మాదిగ, మాదిగ ఉపకులాల, కుమురంభీం ఆదివాసీ, సంత్ సేవాలాల్ లంబాడా, ఎరుకల ఇతర ఉప కులాల కోసం ఏకలవ్య కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసింది. ఇదిలా ఉండగా గత ప్రభుత్వం ఎంబీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.1,000 కోట్లు కేటాయించిన అందులో ఏ ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయాలేదని వివిధ సంఘాల నేతలు వాపోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కార్పొరేషన్‌లకు సకాలంలో నిధులు కేటాయించి ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని ఆయా సంఘాల నేతలు కోరుతున్నారు.

కార్పొరేషన్ ఏర్పాటు నిర్ణయంపై హర్షం
కాంగ్రెస్ ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించడంతో బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్పొరేషన్‌లకు ప్రత్యేక నిధులు కేటాయిస్తే నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు దక్కే అవకాశం ఉంటుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొన్నేళ్లుగా ఆయా శాఖలకు అంతంత మాత్రంగానే ప్రభుత్వం నిధులు కేటాయించడంతో తాము రుణాలు పొందలేకపోతున్నామంటున్నారు. ప్రస్తుత ప్రభుత్వం సకాలంలో నిధులు కేటాయించి తమ ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని కోరుతున్నారు.

సంతోషకరం



కాంగ్రెస్ ప్రభుత్వం రెండు రోజుల కిందట గంగపుత్ర కార్పొరేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించడం సంతోషకరంగా ఉంది. ప్రభుత్వం కార్పొరేషన్‌కు నిధులు కేటాయిస్తే ఆర్థికంగా వెనుకబడి ఉన్న గంగపుత్రులు రుణం తీసుకొని అభివృద్ధి చెందడానికి ఆస్కారం ఉంటుంది.

– మ్యాకల అశోక్, గంగపుత్ర సంఘం జిల్లా నేత

నిధులు కేటాయించాలి



గతంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఆయా ఆర్థిక సంవత్సరంలో నిధులు కేటాయించి నిరుద్యోగులను రుణాలను అందజేసి అండగా నిలిచేవారు. కొన్నేళ్ల నుంచి అలాంటి రుణాలు అందడం లేదు. గత ప్రభుత్వం దళిత బంధు పథకం ప్రవేశపెట్టిన్నప్పటికీ అందరికీ రుణాలు అందలేదు. కార్పొరేషన్‌కు సకాలంలో నిధులు కేటాయిస్తే అభివృద్ధి చెందడానికి ఆస్కారం ఉంటుంది.

– మల్యాల మనోజ్, మాదిగ సంఘం జిల్లా నేత

అ'పూర్వం'.. 50 ఏళ్ల ఆత్మీయం

- ఘనంగా 1973–74 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం
- వేదికైన తలమడుగు జిల్లా పరిషత్ పాఠశాల



నాడు కొండలు, వాగులు దాటి కిలోమీటర్ల దూరం నడిచి వచ్చి చదువుకున్న బాల్యమిత్రులు వారంతా.. నూనుగు మీసాల వయసులో పదో తరగతి పూర్తి చేసిన క్లాస్‌మెట్స్.. అనంతరం ఎక్కడెక్కడే స్థిరపడ్డారు.. కట్ చేస్తే.. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 50 ఏళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడు కలుసుకున్నారు. ఆత్మీయ సమ్మేళనం పేరిట ఒక్కచోట చేరారు. ఇందుకు చదువులమ్మ ఒడి వేదికైంది. వారే తలమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1973–74 బ్యాచ్ పూర్వ విద్యార్థులు. తెల్ల జుట్టు.. మారిన ముఖాలు.. ఒకరినొకరు గుర్తు పట్టుకోలేని వారంతా శుక్రవారం మళ్లీ నాడు చదువుకున్న పాఠశాలకు చేరుకున్నారు. అడుగు పెడుతూనే నాటి మధుర స్మృతులను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. ఆత్మీయ ఆలింగనాల అనంతరం పరిచయ కార్యక్రమం చేపట్టారు. పాఠాలు చెప్పిన గురువులను సన్మానించారు. ప్రస్తుతం పాఠశాలలో చదవుతున్న పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేశారు. ఇక్కడే చదివి ఈ బడిలోనే హెచ్‌ఎంగా పనిచేసి రిటైర్డ్ అయిన ఎల్‌టీ కృష్ణారెడ్డి మాట్లాడారు. విద్యార్థుల తలరాతలు మార్చేది ఉపాధ్యాయులే అన్నారు. ఇష్టపడి చదివితే ఉన్నతంగా రాణించవచ్చన్నారు. పాఠశాలలో నాడు 45 మంది విద్యార్థులు ఉండగా.. అందులో చాలా వరకు చనిపోయారు. మిగిలిన వారిలో 15 మంది వరకు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం వీరిని పాఠశాల ప్రస్తుత ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. తర్వాత ప్రస్తుత పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం కొనసాగింది. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కాటిపల్లి అశోక్‌రెడ్డి. మంతెన దశరథ్, లక్ష్మారెడ్డి, అమృత్‌రావు, ప్రకాశ్‌రెడ్డి, ప్రస్తుత హెచ్‌ఎం వెంకటరావ్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

– తలమడుగు

టెక్నికల్ ఆఫీసర్ ఆత్మహత్యాయత్నం

- మృత్యువుతో పోరాడుతున్న రాకేశ్
- అధికారులు వేధింపులే కారణమని కుటుంబీకుల ఆరోపణ



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాకేశ్

జన్నారం: తన కార్యాలయంలో పని చేస్తున్న ఉన్నతాధికారులు వేధింపులకు గురి చేయగా, మానసికంగా కుంగిపోయిన నీటిపారుదల శాఖ జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ ఆత్మహత్యాయత్నం చేసి మృత్యువుతో పోరాడుతున్నాడు. బాధితుడి తల్లి తోకల సరస్వతి, తమ్ముడు విషేష్ తెలిపిన వివరాల ప్రకారం.. జన్నారం గ్రామపంచాయతీకి చెందిన తోకల రాకేశ్ కడెం నీటి పారుదలశాఖ కార్యాలయంలో జూనియర్ టెక్నికల్ ఆఫీసర్‌గా పని చేస్తున్నాడు. కొన్ని నెలలుగా రాకేశ్‌ను ఇదే కార్యాలయంలోని సూపరింటెండెంట్ ప్రభాకర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ వేధింపులకు గురిచేస్తున్నారు. గతంలో ఇలాగే వేధింపులకు పాల్పడగా, రాకేశ్ తండ్రి వారికి ఫోన్ చేసి బెదిరించాడు. మూడు నెలల క్రితం రాకేశ్ తండ్రి గుండెపోటుతో మృతి చెందాడు. అప్పుడు రాకేశ్ 15రోజులు సెలవు తీసుకున్నాడు. తిరిగి విధుల్లో చేరిన రాకేశ్‌ను కొంతకాలంగా మళ్లీ వేధిస్తున్నారు. ఈ విషయం రాకేశ్ ఇంట్లో చెప్పాడు. తన తండ్రి మూడు నెలల కర్మ కోసం సెలవు అడగగా సదరు అధికారులు వేధింపులకు గురి చేశారు. ఈ వేధింపులు భరించలేక రాకేశ్ గురువారం సాయంత్రం ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు మండల కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించారు. వైద్యుల సూచన మేరకు కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. ఈ విషయంపై జన్నారం పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు రాకేశ్ తల్లి సరస్వతి తెలిపింది. తన కుమారుడిని వేధింపులకు గురిచేసిన అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరింది. కాగా, ఈ విషయంపై ఇరిగేషన్ డీఈ బోజదాస్‌ను 'సాక్షి' వివరణ కోరగా, రాకేశ్‌ను కార్యాలయంలో ఎవరూ వేధింపులకు గురి చేయలేదని తెలిపారు. గురువారం విధులకు హాజరై వెళ్లాడని, అతడు అనారోగ్యంతో బాధపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై ఎస్సై సతీశ్‌ను కూడా 'సాక్షి' వివరణ కోరగా ఇంకా ఫిర్యాదు అందలేదని తెలిపారు.

కరెంట్ బిల్లు షాక్



బిల్ చూపుతున్న వినియోగదారురాలు

లక్ష్మణచాంద: మండలంలోని కొట్టూరు రాములు ఇంటికి నెల విద్యుత్ బిల్లు రూ.5,565 వచ్చింది. దీంతో ఆ బిల్లు చూసిన రాములు ఇద్దరమూ ఉండే ఇల్లుకు ఇంత బిల్లు రావడం ఏమిటని వాపోతున్నాడు. గతంలో నెల నెల రూ.120–150 బిల్లు వచ్చేదని, ఇప్పుడు రూ.5,565 బిల్ ఎలా వచ్చిందని ఆయన వాపోతున్నారు. దీనిపై సాక్షి ఫోన్‌లో మండల విద్యుత్ ఏఈ మహేష్‌ను సంప్రదించగా గతంలో మీటర్‌కు అనుమతి తీసుకునే సమయంలో తక్కువ వాట్స్‌కు అనుమతి తీసుకుని ఎక్కువ వాట్స్ వినియోగించడంతో తనిఖీ చేసిన అధికారులు చూసి అప్పుడు ఫైన్ వేసి ఉంటారని, కాని వారు వినియోగదారుడు చెల్లించకపోవడంతో ఇప్పుడు అదే బిల్లులో కలిపి వచ్చి ఉంటుందని ఆయన తెలిపాడు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- నిమిషాల వ్యవధిలో రెండు ప్రమాదాలు, నలుగురికి తీవ్రగాయాలు
- ఒకే కారు ఢీకొని ఉంటుందని గాలిస్తున్న పోలీసులు



నవీన్ మృతదేహం

గుడిహత్నూర్: మండలంలో నిమిషాల వ్యవధిలో జరిగిన ఇరు రోడ్డు ప్రమాదాల్లో ఓ యువకుడు మృతిచెందగా మరో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. బజార్‌హత్నూర్ మండలం మాడగూడ, మోర్కండి గ్రామాలకు చెందిన తొడసం బాలాజీ, నవీన్, మేస్రం భీంరావ్‌లు బైక్‌పై ఇచ్చోడ నుంచి ఆదిలాబాద్ వెళ్తున్నారు. ఈ క్రమంలో వెనుక నుంచి గుర్తు తెలియని కారు ఢీకొంది. దీంతో సంఘటనా స్థలంలో నవీన్ (22) మృతిచెందగా మిగితా ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ప్రమాదం జరిగిన నిమిషాల వ్యవధిలో సీతాగోంది సమీపంలో మరో మో టార్ సైకిల్‌పై వెళ్తున్న మహారాష్ట్ర సమీపంలోని గోసాయి ఉందం గ్రామానికి చెందిన బడేవాడ్ శ్రీనివాస్, అమృత్‌రావ్‌లను సైతం కారు వెనుక నుంచి ఢీకొనగా ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న స్థానికులు వీరిని అంబులెన్స్‌లో రిమ్స్‌కు తరలించారు. కాగా నిమిషాల వ్యవధిలో కారు ఢీకొనడంతో ఒకే కారు వీరిని ఢీకొని ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ప్రమాదాలకు కారణమైన కారును పట్టుకోవడానికి ఆయా రూట్లలో ఉన్న పోలీసులకు సమాచారం అందించి గాలిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై బలిరాం తెలిపారు.

అవినీతిపరులను పార్టీలో చేర్చుకోవద్దు



నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

- డీసీసీ అధ్యక్షుడికి, జిల్లా ఇన్‌చార్జి మంత్రికి వినతి

నిర్మల్‌చైన్‌గేట్: అవినీతిపరులను పార్టీలో చేర్చుకోవద్దని కోరుతూ శుక్రవారం జిల్లా కేంద్రంలోని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు నివాసం ఎదుట జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తన అక్రమ ఆస్తులను కాపాడుకోవడానికి పార్టీలు మార్చేందుకు ప్రయత్నం చేయడం సిగ్గుచేటన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో పదేళ్లు మంత్రిగా ఉండి అధికార దాహంతో అక్రమంగా సంపాదించుకున్న ఆస్తులను కాపాడుకోవడానికి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చేందుకు ప్రయత్నాలు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. మాజీ మంత్రి, అతడి కుటుంబీకులు అక్రమించుకున్న చెరువులు, కందకాలు డీ1 పట్టాలను కాపాడుకోడానికి కాంగ్రెస్‌లోకి వచ్చే ప్రయత్నాలు చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి నాయకుడిని పార్టీలో చేర్చుకోవద్దంటూ సీఎంకి వి న్నవించాలని కోరారు. కబ్జామంత్రి పార్టీలోకి వస్తే కాంగ్రెస్‌కు తీవ్ర నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు.

మంత్రి సీతక్కకు వినతి పత్రం అందజేత..
అనంతరం ఉట్నూరు కేబీ కాంప్లెక్స్‌లో నిర్మల్ నియోజకవర్గ నాయకులు జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జును కలిసి మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీలోకి చేర్చుకోవద్దంటూ వినతిపత్రం అందజేశారు.

అంగన్‌వాడీల సమస్యలపై మంత్రి సీతక్కకు వినతి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

ఖానాపూర్: అంగన్‌వాడీ టీచర్లకు వేసవిలో ఒకపూట సెలవులు మంజూరు చేయాలని టీఎన్జీవో అనుబంధ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు గుడిసె సంపూర్ణ కోరారు. ఈమేరకు మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేశారు. ఉట్నూర్‌కు వచ్చిన మంత్రిని ఖానాపూర్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు కలిసి సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి సంబంధిత శాఖ సెక్రటరీతో ఫోన్‌లో మాట్లాడారు. తర్వాత వేసవిలో ఒంటిపూట సెలవులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చినవారిలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు వంగ వరలక్ష్మి, నాయకులు ఆర్.విజయలక్ష్మి, లీలారాణి, కవిత, మంగమ్మ, రాజేశ్వరి, భాగ్యరేఖ తదితరులు ఉన్నారు.

అడెల్లి మహాపోచమ్మను దర్శించుకున్న కోరుట్ల ఎమ్మెల్యే



కార్యకర్తలతో ఆలయం ఎదుట ఎమ్మెల్యే సంజయ్

నిర్మల్: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శ్రీఅడెల్లి మహాపోచమ్మ అమ్మవారిని శుక్రవారం కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ నాగులపేట కార్యకర్తలతో కలిసి దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ సిబ్బంది ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం బాలాలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఆయనను ఆలయ సిబ్బంది సన్మానించి అమ్మవారి చిత్రపటాన్ని, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సీనియర్ అసిస్టెంట్ రమణారావు, ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాస శర్మ ఉన్నారు.

ఎలక్ట్రీషియన్‌పై హత్యాయత్నం

ఉట్నూర్‌రూరల్: మండలంలోని లక్కారం గ్రామ పంచాయతీలో ఎలక్ట్రీషియన్‌గా విధులు నిర్వహిస్తున్న గౌడిపెల్లి సోముపై గుర్తు తెలియని వ్యక్తి కత్తితో దాడిచేసిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై మనోహర్ తెలిపిన వివరాల ప్రకారం ... ఉట్నూర్ మండలం లక్కారంలో నివాసముంటున్న సోము శుక్రవారం లక్కారం గ్రామపంచాయతీ సమీపంలోకి వెళ్లగా ఓ గుర్తు తెలియని యువకుడు సోముపై కత్తితో దాడి చేయగా మేడ, కడుపులో గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు కేకలు వేయడంతో నిందితుడు కత్తిని వదిలి పారిపోయాడు. స్థానికులు గాయాలపాలైన సోమును ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి రెఫర్ చేశారు. సోము సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.



చేతిపంపు వద్ద స్థానికులు

భగీరథ రాక.. జనాల వ్యథ

ప్రతి ఇంటికి శుద్ధజలాన్ని అందించాలనే ఉద్దేశంతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మిషన్ భగీరథ పథకం నీటి సరఫరా బేల మండలం అవల్‌పూర్ గ్రామంలో సగం ప్రాంతానికే పరిమితమైంది. మరో సగం గ్రామానికి చుక్క నీరు రావడం లేదు. దీనికి తోడు బోరుబావుల్లోనూ నీరు అడుగంటిపోయింది. దీంతో చేతి పంపే వారికి పెద్ద దిక్కుగా మారింది. 500మంది జనాభా ఒకే ఒక చేతి పంపుపై ఆధారపడాల్సి వస్తోంది. నీటి కోసం జనాలు తీవ్ర ఇబ్బందులు పడుతుండడం గ్రామంలో నెలకొన్న నీటి సమస్యకు నిదర్శనంగా నిలుస్తోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్



అలంకారప్రాయంగా మిషన్ భగీరథ కుళాయి



అడుగంటిపోయిన బోరుబావి

ఉక్కపోత... రోగుల అవస్థ



వెయిటింగ్ హాల్‌లో పనిచేయని ఫ్యాన్‌లు



ఇంటి నుంచి తెచ్చుకున్న ఫ్యాన్

ఆదిలాబాద్ జిల్లాలో ఎండల తీవ్రత పెరిగింది. దీనికి తోడు ఉక్కపోత తీవ్రంగా మారింది. దీంతో రిమ్స్ ఆస్పత్రిలోని పలు వార్డుల్లో ఫ్యాన్లు లేకపోగా.. ఉన్న ఫ్యాన్లు పనిచేయకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉక్కపోతను భరించలేక రోగులు ఇంటి వద్ద నుంచి టేబుల్ ఫ్యాన్లను వెంట తెచ్చుకుని ఉపశమనం పొందుతుండటం రిమ్స్ దుస్థితికి నిదర్శనంగా నిలుస్తోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్